ఓం నారాయణ - ఆదినారాయణ

# అవధూత లీల

## అధ్యాయము - 21

## శ్రీస్వామివారి దివ్యబోధ



**శ్రీస్వామివారిని 'మాకేమైనా బోధించండి స్వామీ' అని అనేక మంది అడిగినప్పుడు స్వామివారు 'చూచినేర్చుకోండయ్యా' అని క్లుప్తంగా బోధించేవారు.** 58

వారు వాచా ఎన్నడూ బోధ అని ప్రత్యేకంగా చెప్పకపోయిననూ వారి జీవితకాలంలో భక్తులతో వారు మాట్లాడిన మాటలే మనకు దివ్యబోధలు. వాచా బోధించే కంటే నిత్య సత్యమైన నిదర్శనముతో శ్రీస్వామివారు ఒకటి రెండు ముక్తసరి ముక్కలు మాట్లాడినా అవే వేదముల సారాంశముగా ఉండడం గమనార్హము. అట్టి దివ్యమైన ధర్మబోధలు కొన్ని ఈ క్రింద చూడగలము.

**అజ్ఞానులమైన మనం పెద్దలు చెప్పిన కొన్ని విషయాలను మూఢనమ్మకాలని త్రోసిపుచ్చుచుంటాము. కానీ ఈ విషయాలలో శ్రీస్వామివారి వంటి మహనీయులు చెప్పిన మాట అందరికీ శిరోధార్యము.** 59

కారి రామస్వామి ఇలా వివరించారు. "పొదలకూరులో రెండెడ్ల బండి కొనేందుకు అడ్వాన్సు ఇచ్చి శ్రీస్వామివారికి ఆ విషయం చెబితే 'అయ్యా ఆ బండి ఇంటికొస్తే మంచిదికాదు. దాని ఇరుసులో కోడిపుంజులు పోట్లాడుతున్నాయి. అదివద్దు' అన్నారు. చెర్లోపల్లిలో మరొక బండి మాట్లాడి వచ్చి స్వామికి చెప్పాను 'అయ్యా ఆ బండి వస్తే ఆడవాళ్ళకు జబ్బులు కలుగుతాయి, అది వద్దు' అన్నారు. తరువాత తురిమెర్లలో మరొక బండి చూచివచ్చి చెప్పాను. 'అయ్యా ఆ బండి వస్తే పిల్లకాయలకు జబ్బు చేస్తుంది అది వద్దు' అన్నారు. ఒక వారం రోజుల తరువాత బండి కొనేందుకు ఏ గ్రామం పొమ్మంటారో అడగాలని శ్రీస్వామివారి చెంతకు వెళ్ళాను. నేనా విషయం వారి నడగకమునుపే 'అయ్యా రాజుపాళెంలో నాలుగు వందల రూపాయలకు క్రొత్తబండి ఇస్తారు. తోలుకొచ్చుకో' అన్నారు. ఆ బండి ఏరోజు తోలుకొస్తే మంచిదని అడిగాను. 'అయ్యా సోమవారం ఉదయాన్నే

సూర్యోదయానికి పూర్వమే నీవు బండి కొన్న గ్రామం వదలి బండి తోలుకొని వచ్చేయాలి. మీ గ్రామంలో రాములవారి దేవాలయం వద్ద మూడు నిద్రలు చేయించి, మీ పిల్లకాయలందరిని బండిలో ఎక్కించి ఊరంతా త్రిప్పుచూ శెనగలు, బొరుగులు, బెల్లం, పంచదార పెడుతూ బండిని ఇంటికి తోలుకురమ్మ'ని సెలవిచ్చారు. నేనలాగే చేశాను. ఆ బండి గత ఇరవై ఐదు సంవత్సరముల నుండి పనిచేస్తూనే ఉంది. ఎలాంటి యాక్సిడెంట్లు లేవు. ఆ బండి వచ్చాక మాకు భూస్థితి పెరిగింది. ఈనాటికీ దాన్ని గురు ప్రసాదంగా పరమ పవిత్రంగా వాడుకొనుచున్నాము."

ఒకానొక బండి ఇరుసులో కోడిపుంజులు పోట్లాడడం ఏమిటి? కొయ్యతో చేయబడిన ఒక బండి ఇంటికివస్తే ఆడవాళ్ళకు జబ్బు చేయడమేమిటి? మరొక బండి వస్తే పిల్లలకు జబ్బులు చేయడమేమిటి? ఇలాంటివి విన్నప్పుడు అజ్ఞానులమైన మనకు మూఢ నమ్మకాలుగా ఉంటాయి. ఇలాంటి విషయాలలో సర్వజ్ఞుడైన శ్రీస్వామివారి మాటే శిరోధార్యం.

**శ్రీస్వామివారి బృందంలోని వారెవరైనా దురుసుగా మాట్లాడినపుడు**
60 **'ఫలానావాడు ఇలా మాట్లాడాడు స్వామీ' అని చెపితే 'ఆయనలో బొమ్మలేచింది లేయ్యా! ఆయనేం చేస్తాడు' అనేవారు.**

అలాగే ఒకరోజు మాటల సందర్భంలో శ్రీస్వామివారు బరిగెల నాగయ్యతో అన్నారు 'బొమ్మల కత్తిరింపు మన దగ్గరుండ్లాయ్యా' అని. మనలోని దుర్గుణాలే మనలోని బొమ్మలు. శ్రీస్వామివారికి మనపై దయగల్గినట్లయితే మనపై తన కత్తిరింపు ప్రయోగం చేసి ఆయా దుర్గుణాలను నిర్మూలించగలరు.

**ఒక వ్యక్తి వలన అనేక మందికి అసౌకర్యము, ప్రమాదము అని శ్రీస్వామివారు తలచినట్లయితే - మాట మందలింపు లేకుండానే తనకై**
61 **తానే ఆ ప్రదేశం వదలి వెళ్ళేటట్లు శ్రీస్వామివారు ఆ వ్యక్తి హృదయాన్ని ప్రేరేపించేవారు.**

ఉదా:- ఒక భక్తుడు ఒక అరగంట ఆలస్యమైనా సరే శ్రీస్వామివారి నిత్యపూజ తాను వచ్చేంతవరకూ ఆపాలని, తాను ఉన్నప్పుడు తానే స్వయంగా శ్రీస్వామివారి సమాధి పూజ చేయాలని అప్పుడప్పుడూ ఆదేశించేవాడు. నిత్యపూజను ఆ విధంగా ఆలస్యం చేయడం ఎంతవరకు ధర్మమో యోచించలేదు.

ఆ భక్తుని హృదయంలో శ్రీస్వామివారు ఏ చిత్రమైన ప్రేరణ పెట్టారో ఏమోగానీ అతడు తనకై తానే దూరంగా ఉండడం మొదలు పెట్టి, అలాంటి సేవలు మానుకున్నాడు; **ధర్మాధర్మాలు యోచించకుండా ప్రవర్తిస్తే మనపై** 62
**కూడా శ్రీస్వామివారు తమ కత్తెర ప్రయోగం చేస్తారని గుర్తించి మెలగాలి.**

ఒకప్పుడు శ్రీస్వామివారి సేవకులు ఇద్దరు కలహించుకొని కలబడ్డారు. ఒకడు గొడ్డలి తీసుకున్నాడు. రెండవ సేవకుడు గొడ్డలి పీక్కొని అతని మెడపై కొరికాడు. అతనికి రక్తం కారి గ్రామంలోని పెద్దలకు చెప్పుకున్నాడు. వారంతా ఆ రక్తం చూచి అలా చేసిన వాణ్ణి ఆశ్రమం నుండి వెళ్ళగొట్టమని శ్రీస్వామివారికి విన్నవించారు. అప్పుడు **శ్రీస్వామివారు 'అయ్యా ఒకరిని** 63
**పొమ్మనే కంటే మనమే పోతే మంచిది కదా?' అని సెలవిచ్చారు. ఈ ధర్మ తీర్పుతో అందరూ కిమ్మనకుండా జారుకున్నారు.**

1980 సం॥లో శ్రీస్వామివారికి గుణం వచ్చింది. చేతులు, తల ఎగురవేసేవారు. ఇంజెక్షన్ చేయించాలని డాక్టరును తీసుకువచ్చారు.

సేవకుడు : స్వామీ!
స్వామి : వచ్చాడయ్యా?
సేవకుడు : ఇంజెక్షన్ చేస్తాడు స్వామీ!
స్వామి : ఎవరికి?
నాగయ్య : మీకే స్వామీ!
స్వామి : ఎందుకు?
నాగయ్య : గుణం తగ్గేందుకు స్వామీ.
స్వామి : తగ్గుతుందాయ్యా?
నాగయ్య : తగ్గుతుంది స్వామీ.
స్వామి : చేసుకోమను.

డాక్టరు ఇంజెక్షన్ చేశాడు. కాని శ్రీస్వామివారు ఏ మాత్రమూ చేయి కదల్చడంగానీ, బాధను వ్యక్తం చేయడంగానీ లేదు. మూడు రోజుల తర్వాత శ్రీస్వామివారు మరలా అన్నారు.

స్వామి : అయ్యా, సూదేశారే, తగ్గిందా అయ్యా!
నాగయ్య : తగ్గలేదు స్వామీ, మీరు తగ్గమని చెపితే తగ్గుతుంది.

స్వామి : అది ఎట్లా తగ్గుతుందయ్యా?

నాగయ్య : తగ్గుతుంది స్వామీ, మీరు చెప్పండి.

స్వామి : నువ్వు భలే మాట్లాడుతావయ్యా!

శ్రీ సాయినాథునివలె శ్రీస్వామివారు కూడా తమ రుగ్మతలకు మందులు సేవించక ఓర్పుతో అనుభవించేవారు. **సేవకులతో గూడా 'నొప్పి**
64 **ఎంత అనుభవిస్తే అంత మంచిది' అని చెప్పేవారు.** ఒక్కొక్కప్పుడు ఉడకబెట్టిన తెల్లగడ్డలు, కరివేపాకుపొడి, ధనియాల పొడి మొదలగు వాటిని తమ రుగ్మతలకు వాడేవారు. కొంతమంది రోగాలకు కొన్ని ఆకులు, వేళ్ళు చెప్పి తినమనేవారు.

రోశిరెడ్డి : స్వామీ! ఎల్లప్పుడూ తమరు మౌనంలో ఉంటిరే! మరి మాకు మంచి, చెడ్డ తెలిసేదెట్లా?

స్వామి : మూడు వందలు ఇస్తే సాదయ్య వచ్చి చెపుతాడు.

స్వామి : (మరొక రోజు అన్నారు) రోశిరెడ్డీ! పెద్దవాడివిగదా! ఎవరికైనా హెచ్చు తగ్గులుంటే చెప్పయ్యా!

గురవయ్య : స్వామీ, దేవుడెట్లా కనపడతాడు?

స్వామి : అందరినీ సమానదృష్టితో చూచుకుంటే దేవుడు కనపడతాడు.

గురవయ్య : మరొక రోజు ఇదే ప్రశ్న అడిగాడు.

స్వామి : వీరబ్రహ్మంగారి చరిత్ర చదువు అనుభవమౌతుంది.

ఇక్కడ శ్రీస్వామివారు తమ భక్తులను అనేక మంది మహనీయుల చరిత్రలను శ్రద్ధగా పఠించమని ఆదేశిస్తున్నారని మనం గుర్తించాలి. లేకుంటే తమను గురువుగా విశ్వసించి సేవించుకునే అతణ్ణి మరొక మహనీయుని చరిత్ర చదవమనడమెందుకు? అవధూతలందరికీ మూలపురుషుడైన శ్రీ దత్తాత్రేయ స్వామియే శ్రీస్వామివారి రూపంలో గూడ మనలననుగ్రహించి ఆ సాంప్రదాయముననుసరించి ఇలా ఆదేశిస్తున్నారు.

గురవయ్య ఏదైనా చెప్పమని అడిగితే, 'సంపన్నత్వం కల్గి సాధారణంగా నడచుకో. సత్యం, ధర్మం తప్పకుండా ఉండు' అన్నారు.

సంపన్నత్వమంటే సత్వగుణ ప్రధానమైన దైవీసంపద లక్షణాలు,

సాధారణత్వమంటే 'నాకు గొప్ప గుణములు గలవు' అనే అహంభావం లేకుండా శ్రీస్వామివారివలె అతి సాధారణ మానవునివలె నడచుకోవాలని శ్రీస్వామివారి ఆజ్ఞ. నిజానికి ఈ రెండు శ్రీస్వామివారు మనకు వారి ఆచరణ ద్వారా బోధించి చూపారు.

'కోపమెట్లాపోతుంది స్వామీ?' అంటే 'ప్రొద్దు పొడిచేది, క్రుంకేది తెలియకుండాపోతే పోతుంది' అన్నారు. అదే ప్రశ్న మరొకప్పుడడిగితే, 'సూర్యచంద్రులకు అర్ఘ్యం పెడితే పోతుంది' అన్నారట.

ఒకరోజు మోపూరు దశయ్య గన్నేరు పూలు కోస్తున్నాడు. శ్రీస్వామివారు అతనిని పిలిచి, 'ఒక్క పువ్వే గదయ్యా' అన్నారు. మరలా మాట్లాడలేదు. మనస్సు అనే ఒక్క పుష్పమే గదా భగవంతుడు కోరేది అని శ్రీస్వామివారు హెచ్చరించారని అతడు గుర్తించాడు.

భక్తుడు మనస్సునుగాని లేక హృదయాన్ని నిజంగా సద్గురువుకుగానీ, దైవానికిగానీ సమర్పించినపుడు అలా చేయడం ఒక్కసారి మాత్రమే సాధ్యం. అందుకు సంకేతంగా ఒక్క పువ్వు చాలని శ్రీస్వామివారి భావం. పూజకోసం అధికంగా తులసి కోస్తున్న భక్తురాలితో ఈ విషయాన్నే శ్రీరమణమహర్షి ఎంతో చమత్కారంగా చెప్పాడు. అలానే శ్రీసాయిబాబా మరలా నమస్కరించ బోయిన ఒక భక్తునితో 'నీవు హృదయపూర్వకంగా చేసిన ఒక్క నమస్కారమే చాలు' అని హెచ్చరించారు.

ఒక భక్తురాలు ప్రజలకు వడ్లు అరువుగా ఇచ్చి 'నాము' అనే పేరుతో అధికంగా లాభం గడించేది. ఒకప్పుడు ఆమె ఇల్లు కాలిపోయింది. ఆ ప్రమాదంలో చాలా ధాన్యం గూడా నష్టమైంది. కాని ప్రక్కవారి సహాయంతో కొంత ధాన్యమైనా దక్కించుకోగల్గింది. అయినప్పటికీ నష్టమైన దాన్ని గురించి ఆమె బాధపడుతూనే ఉండేది. ఒకసారి ఆమె శ్రీస్వామివారిని దర్శించి 'స్వామీ, ఇల్లు తగులబడి సర్వనాశనమైంది' అని విలపించింది. 'అమ్మా, లాభమే పోయింది. అసలు దక్కింది గదా?' అన్నారు శ్రీస్వామివారు. నిజానికి ఆ గ్రామస్థులు 8 పుట్ల గింజలను ఆ అగ్ని ప్రమాదం నుండి తప్పించి బయటపోశారనీ, మిగిలిన సామానులు, వడ్లు తగలబడినాయని ఆమె అంగీకరించింది. అన్యాయార్జితమైన ధాన్యం అగ్నిపాలయింది. అందుకే

శ్రీస్వామివారు 'వడ్డీ విషయంలో కూడా ధర్మంగా వుండాలయ్యో' అని సెలవిచ్చారు.

కోడూరు వెంకమ్మగారి భర్త చనిపోయిన దిగులుతో మంచం బట్టి అహర్నిశలూ శోకిస్తూన్నది. శ్రీస్వామివారు తమ చిత్రమైన తత్వబోధతో ఆమె శోకాన్ని నివారించారు.

'అమ్మా, ఒక మామిడి పండుకు పుండు పడితే అది ఎంత ఫలింపు అవుతుందమ్మా? వరుటుబారి, కుళ్ళి ఎందుకూ పనికి రాకుండా పోతుంది. ఆ పండు ధైర్యంగా ఉండి ఆ పుండును లెక్క చేయకుంటే ఆ పుండు దాన్నేమీ చేయలేదు. పండు మధురంగా తయారై ఎన్నో కాయల్నిస్తుంది. అది ఎన్నోసార్లు ఇలాంటి చెట్లు అయిన తరువాత మనిషవుతుంది. ఇలా మనిషిగా ఎన్నోసార్లు జన్మించాక కాస్త బుద్ధిగలవాడౌతాడు. అలాంటి బుద్ధిగలవాడుగా ఎన్నోసార్లు జన్మించాక ఒక జన్మలో భక్తుడవుతాడు. తర్వాత అలాంటి జన్మలెన్నో అయ్యాక ఒక జన్మలో ధర్మంగా పరిపాలించే రాజవుతాడు. అట్లాంటి రాజుగా ఎన్నో జన్మలెత్తిన తర్వాత దేవుని కొరకు పాటుపడుతాడు. అలాంటి ముముక్షు జన్మలు ఎన్నో గడిచాక దేవుని సన్నిధిలో ఉంటాడు. అప్పుడు దేవుడు తన కన్ను కొద్దిగా తెరచి భక్తుని చూస్తాడు. ఆయన తన బొటన వ్రేలు క్రింద ఉండే అల్లెతాడు త్రొక్కితే ప్రపంచంలో ఉండే బొమ్మలాటంతా అతడికి కన్పిస్తుంది. అప్పుడు దేవుడు అతనిని తనలో చేర్చుకుంటాడు' అది విని వెంకమ్మ, 'ఇప్పటికే ఇన్ని జన్మలు ఎత్తి ఎన్నో బాధలు పడుతున్నాను. ఈ కొంచెం బాధలు ఒక లెక్కా? ధైర్యంగా మామిడిపండువలె వుండాలని' అనుకొని, అది మొదలు ఏడ్చేది కాదు.

**పని చేయకుంటే ఉద్యోగం నష్టం. పనిచేయకున్నా జీతం రావచ్చు.
కానీ అది దక్కదు (నష్టపడతావని భావం). కష్టం చేస్తూనన్నా ఉండు.
దేవుని ధ్యానం చేస్తూనన్నా ఉండు. రోగంతో మూలుగుతూనన్నా ఉండు.**
65 **దరిద్రంతో బాధపడుతూనన్నా ఉండు (ఈ నాలుగు దశలలోను మానవునకు
నిరంతరం దేవుడు గుర్తు వస్తుంటాడని కాబోలు శ్రీస్వామివారు అలా చెప్పారు).
అంతేగాక కష్టం చేస్తున్నా, రోగంతో మూలుగుతున్నా, దరిద్రంతో బాధ
పడుతున్నా కర్మశేషం ఖర్చవుతుంటుంది. ధ్యానం చేస్తుంటే క్రొత్తగా కర్మ
సంక్రమించదు.**

ఒక భక్తుడు తరుచుగా శ్రీస్వామివారి దర్శనార్థం వస్తూ తనకు శ్రీస్వామివారి రక్షణ ఉందనే ధీమాతో ఆఫీసు పని బాగా నిర్లక్ష్యం చేసేవాడు. పై అధికారిని గూడా లెక్క చేసేవాడు కాదు. ఒకరోజు శ్రీస్వామివారు అతని స్వప్నంలో "what do you mean by negligence of duty, bloody idiot". **(బుద్ధి లేని వాడా! విద్యుక్త ధర్మాన్ని అశ్రద్ధ చేయడమంటే ఏమనుకుంటున్నావ్) అని తీవ్ర స్వరంతో మందలించారు. ఆ భక్తుడు 'స్వామీ, మీకు ఇంగ్లీషు కూడా వచ్చా' అన్నాడు. 'ఇంగ్లీషేమిటి ప్రపంచ భాషలన్నీ వచ్చు' అని మందలించారు శ్రీస్వామివారు. తమ భక్తులను పాపభారము నుండి ఎలా కాపాడుతారో చూడండి.** 66

నిరంతరం తన సేవలో నున్న గురవయ్యతో అన్నారు, 'మాల, మాదిగ, జోగి, జంగంవాళ్ళు చేరకుండా చూచుకో, సత్యం, ధర్మం, సాధారణత్వం, సద్గురుసేవ సాధించు'. ఇది "మనలో ఒక హీనజాతి వాడున్నాడు వాణ్ణి వెళ్ళగొట్టాలి" అన్న శ్రీసాయి ఆదేశం వలె ఉంది!

మాల, మాదిగ, జోగి, జంగం అంటే మనలోని దుర్గుణాలని శ్రీస్వామివారి భావం.

ఒకసారి శ్రీస్వామివారు గురవయ్యతో అన్నారు 'తప్పుచేస్తే వద్దిదొండ పురుగులు పడుతాయి. మాదిగ ఇండ్లలో పుడుతారు'. ఇక్కడ మాదిగ అన్నది ఈనాటి వర్ణ వ్యవస్థలో జన్మవలన వచ్చే వర్ణవిశేషం గురించి కాదని గుర్తించాలి. 'మరలా ఎన్నో జన్మలకు కూడా నా దగ్గరకు రాలేరు' అని కూడా అనేవారు శ్రీస్వామివారు.

| | | |
|---|---|---|
| దశయ్య | : | తరించే దెట్లా స్వామీ? |
| స్వామి | : | **ఆశపోతే అంతా పోతుండ్లాయ్యా!** 67 |
| అమ్మ | : | స్వామీ! మిమ్ములను తెలుసుకునేదెట్లా? |
| స్వామి | : | అమ్మా, భద్రాచలం పోయి గర్భగుడి తెరిచి చూడు తెలుస్తుంది. |

మరి అమ్మ అలా చేసిందో లేదో తెలియదు. ఇదే విధంగా అడిగిన చల్లా సుబ్బమ్మతో కోటితీర్థం దేవాలయం మీద చూడమన్నారు. ఆమె అలాగే చేసింది. **ఆమె కచ్చుట అనంతమైన వెలుగు దర్శనమైంది. పార్వతీదేవి**

**ప్రకృతి మాత గదా. 'పరబ్రహ్మ స్వరూపుడనైన నేనే ఈ దృశ్య జగత్తుగా**
**68 ప్రకటమౌతున్నాను. అన్నింటిలో అంతటా నన్నే భావన చేయమ'ని బోధించారన్నమాట.**

ఒకప్పుడు మోపూరు దశయ్య 'స్వామీ, మీకు అడవిలో ఎవరో ఒక ఋషి కనపడి నాలుక మీద బీజాక్షరాలు వ్రాశారని చెపుతున్నారు నిజమేనా?' అని అడిగాడు **"మైసూరు మహారాజు త్రోవన పోతుంటే మనం చూస్తే**
**69 మనకేమి వస్తుంది? మనం చేసుకున్నదే గదా మనకు?"** అని శెలవిచ్చారు శ్రీస్వామివారు. అంటే దాని అర్థం మనకు అవకాశమున్నంత వరకు **జపధ్యానాలు, ధర్మాచరణ, సద్గురు సేవ చేస్తూంటేగాని మహారాజు వంటి మహాత్ముని అనుగ్రహం మనకు లభించదు. మనము అట్టి సాధన చేసి**
**70 పరిపాకాన్ని పొందితే అట్టి ప్రతిభావంతులను మహారాజు ఆహ్వానించి తన ఆస్థాన పండితులుగా నియమించుకున్నట్లు ఎవరో ఒక మహనీయుడు మనలననుగ్రహిస్తారని శ్రీస్వామివారి భావం.**

రాజు సర్వశక్తిమంతుడు, సర్వస్వతంత్రుడూ అయినా కష్టించి ప్రతిభను సంపాదించుకున్న వారిని తప్ప మిగిలిన వారిని చేరదీసి సత్కరించడు. శ్రమపడి సాధన చేస్తేనే శ్రీస్వామివారు కృప చూపుతారని గుర్తించాలి.

వెంకయ్య ద్వారా ఒకరు శ్రీస్వామివారికి కట్టెలు తోలినందుకు బండి బాడుగ రూ।। 4/- తీసుకొని మరలా వెంకయ్య చేత వరికుప్ప దగ్గర ఉచితముగా పని చేయించుకున్నాడు. ఆ బండివాడు స్వామి చెంతకొస్తే ఎవరూ ఏమీ చెప్పకనే శ్రీస్వామివారు "అయ్యా, ఈయన బండాయనా? ఈయన మనకు రూ।। 150/- బాకీ తేలినాడు. అందుకు అపరాధంగా తిరుపతి పోయిరావాలి" అని వ్రాసి ఇచ్చారు. అతడు అట్లాగే తిరుపతి పోయాడు. బండాయన అపరాధం శ్రీస్వామివారి డబ్బులు అలా దొంగలించడమే. **శ్రీస్వామివారి సేవకులు సాక్షాత్తు భగవంతుని సొత్తు. వారి ఋణం భగవంతునికిగానీ,**
**71 వారి గురువుకుగానీ, ఆ సేవకునికిగానీ చెల్లించకుంటే ఆ ధనం నష్టమై తీరుతుంది.**

శత వృద్ధుడు రోశిరెడ్డి చాలా కాలంగా శ్రీస్వామివారి సేవలో ఉన్నాడు. ఒకప్పుడు ఎవరో ఏమో అన్నారని ఇతడు ఇంటికి వెళ్ళాలనుకున్నాడు.

ఆయనను శ్రీస్వామివారు ఏకాంతంగా పిలిచి **"పంటచేను వదిలి పరిగ ఏరుకుంటావా?" అని హెచ్చరించారు. అతడా సంకల్పం విడిచి పెట్టాడు.** 72
సద్గురు సాన్నిధ్యం పంటచేను, సామాన్యంగా జీవిస్తూ ఇతర సాధనలు చేయడం పరిగ ఏరుకోవడం లాంటిదని గుర్తించి చివరి శ్వాస వరకు భిక్షాన్నం తెచ్చే గురుసేవ చేసి తన జీవితం ధన్యం చేసుకున్నారు.

1. **రోశిరెడ్డి గారి యొక్క నిస్వార్థమైన గురుసేవా ప్రభావము వలన వారికి ఆశాపాశములు, బంధుప్రీతి తనవారి పైననేగాక చివరకు** 73
**తన శరీరం మీద కూడా మమకారం లేకుండా చేశారు శ్రీస్వామివారు. ఇలా స్వయంకృషితో సాధించడం దుస్సాధ్యమని సాధకుల అనుభవం.**

2. హృదయాంతరాళములో అంతటి ప్రేమతో తన గురుని సేవించాడు గనుకనే ప్రారబ్ధ కర్మవశాత్తు సంభవించే వృద్ధాప్య శరీర రుగ్మతలు లేకుండా చేశారు శ్రీస్వామివారు.

3. అత్యవసర విషయములలో ఏ వ్యక్తి ఎలాంటివాడు అనే విషయముగానీ, ఎచ్చట ఏమి జరుగుచున్నది అనేది గానీ శ్రీస్వామివారు వీరికి దృశ్య సంకేతములతో చూపేవారు.

ఉదాహరణకు ఒకరోజు రోశిరెడ్డిగారి ఇంటి దగ్గర గాలివానలో వారు తంటాలు పడుతూ చేస్తున్న సజ్జమాసూలు, డబ్బు అవసరమైనందున పిందెలుగా ఉన్న మంచి నిమ్మకాయలు కోసి రాశిపోయడం శ్రీస్వామివారి సన్నిధిలో ఉన్న రోశిరెడ్డికి దృశ్యంగా కనబడసాగింది. మూడవరోజు ఇతని కుమారుడు వచ్చినపుడు విచారిస్తే రెండు విషయాలూ నిజమేనని తేలాయి.

శ్రీ భరద్వాజ మాస్టర్‌గారిని అందరూ దేవుడు, గురువు అని పూజిస్తున్నారు. వీరి అసలు స్థితి ఏమిటా అని మనసులోనే మదనపడుచున్న రోశిరెడ్డికి ఒక దృశ్యం గోచరించింది. మాస్టరుగారు ఒక ఎడారిలో నిలబడియున్నారు. ఉన్నట్లుండి వారు శంఖుచక్రాలు ధరించి మహావిష్ణువయ్యారు. వారి పాదాలు చుట్టూ మంచి నవనవలాడే పచ్చగడ్డి ఉంది. రోశిరెడ్డి ఒక దున్నపోతుగా మారి ఆ గడ్డి మేస్తున్నట్లు దృశ్యం గోచరించింది. ఇదే విధంగా మరియొక వ్యక్తిని గూర్చి యోచిస్తుంటే ఆ వ్యక్తి చెడిపోయిన తాళాల బుర్రలు రిపేరు చేస్తున్నట్లు చూపారు. అంటే ఆ వ్యక్తి

అందరి లోపాలు సరిచేయగల సమర్థుడని శ్రీస్వామివారు వీరికి బోధించారన్నమాట.

ఒకరోజు రోశిరెడ్డిగారి అల్లుడు, కుమారుడు ఆయనను పది రోజులు తన ఇంటికి తీసుకుపోవాలని స్వామివారి ఆశ్రమానికి వస్తున్నారు. అప్పుడు ఆయనకు చూపు సరిగా లేనందువలన ఒంటరిగా ఎక్కడికీ పోలేకున్నాడు. కానీ శ్రీస్వామివారు అతనిని, "త్రోవ పట్టుకొని నేరుగాపో!" అని ఆజ్ఞాపించారు. గుర్వాజ్ఞయందు అచంచల విశ్వాసంగల రోశిరెడ్డి తనకు చూపు కనబడని విషయం కూడా లెక్క చేయకుండా ఎనిమిది కిలోమీటర్లు నడిచి నెల్లూరు నుంచి గొలగమూడికి ఒంటరిగా వచ్చేశాడు. అల్లుడు, కుమారుడు బస్సులో ఈయనకంటే ముందుగా గొలగమూడి చేరి రోశిరెడ్డి కోసం విచారించారు. కానీ నడిచి వస్తున్నందున రోశిరెడ్డి మార్గమధ్యంలో ఉన్నాడు గనుక ఆశ్రమంలో లేడు.

ఒకరినొకరు కలవనందున ఇక రోశిరెడ్డిని వెతికి పట్టుకోవటం కష్టమని వాళ్ళు తిరిగి ఇంటికి వెళ్ళిపోయారు. సర్వజ్ఞులైన శ్రీస్వామివారు అలా ఆదేశించకుంటే తన కుమారుడు, అల్లుడు చెప్పే మాటలకు మెత్తబడి ఇంటికి ప్రయాణమై, **పరిగ ఏరుకోవడం లాంటి లంపటంలో పడకుండా**
74 **గురుసేవలో సమయాన్నంతటినీ గడపడమే త్రోవ పట్టుకొని పోవడమని శ్రీస్వామివారి మాటలకర్థం.** మరొకప్పుడు ఒక భక్తుడు "ఎలా స్వామీ, మేము తరించేది?" అని అడిగితే గూడా శ్రీస్వామివారు, "ఏముందయ్యా, నేరుగా త్రోవ చూచుకుంటూ పోయేదే గదయ్యా" అన్నారు.

పై విధంగా గురువు మాట యందు అచంచలమైన విశ్వాసంతో, గురుసేవే తన ధ్యేయంగా జీవించారు గనుకనే వీరి అంత్య దశలో మంచాన పడడం ఇతరుల సేవ తీసుకోవలసిన అవసరం లాంటివి లేకుండా చేశారు శ్రీస్వామివారు. **వీరు పరమపదించినప్పుడు వీరి ముఖంలోని కళ,**
75 **శరీరంలోని తేజస్సు వలన వీరు తప్పక కైవల్యం పొందారని తెలుస్తుంది. గురుసేవా ప్రభావమంతటి మహిమాన్వితమైనది గదా!**

ఒకనాడు శ్రీస్వామివారు, "వెంటనే మజిలీ మార్చాలి పదండి" అన్నారు. సేవకులు "ఇప్పుడు కాదు. సాయంకాలం కానీ లేక భోంచేసిన

తరువాత గానీ పోదాము” అని చెపుతూ తలా ఒక త్రోవన వెళ్ళుతున్నారు. శ్రీస్వామివారి సమీపంలో ఉన్న బరిగెల నాగయ్య “వీళ్ళు శ్రీస్వామివారి దగ్గరకు వచ్చింది దేనికైనట్లు? శ్రీస్వామివారు చెప్పినట్లు వినరు. వీళ్ళు ఇలా తలా ఒకవైపు వెళ్తుంటే స్వామి అదేమని గదమాయించి అడుగరు! ఇది ఏమిటబ్బా?” అనుకున్నారు. “ఇలా చేయండని” సలహా ఇస్తారేకానీ మహాత్ములు నిర్బంధించరు. వినకపోతే మన కర్మకు మనల్ని వదిలేస్తారు. **మనం తప్పులు
చేస్తూ, “అన్నీ శ్రీస్వామివారే చూచుకుంటారు” అని అనుకోవటం అవివేకం.** 76
**నిజానికి అన్నీ ఆయనే చూస్తారు. ఎవరేమి చేసుకుంటే దానికి తగ్గ ఫలితం నిష్పక్షపాతంగా వద్దన్నా ప్రసాదిస్తారు. మంచికి మంచి, చెడ్డకు చెడ్డ!**

నెల్లూరు వాస్తవ్యులు తాళ్ళూరి శ్రీనివాసులు మేళం వాయించేవాడు. శ్రీస్వామివారు మహాసమాధి చెందినప్పుడు ఆటోరిక్షా రూ॥ 25/- లకు మాట్లాడుకొని, మేళం వాయించడానికి గొలగమూడి వచ్చాడు. డ్రైవరు ఆశ్రమం వారితో అబద్ధం చెప్పి రూ॥ 5/- ఎక్కువ తీసుకున్నాడు! అతడిలా చేశాడని శ్రీనివాసులుకు తెలిసింది. తిరుగు ప్రయాణంలో ఆటోరిక్షా ఒక ఫర్లాంగు పోయి అకారణంగా ఆగిపోయింది. ఎంత ప్రయత్నించినా కదలలేదు. శ్రీనివాసులు ఆటో డ్రైవరుతో, “నీవు అబద్ధం చెప్పి శ్రీస్వామివారి డబ్బు రూ॥ 5/- లు ఎక్కువ తీసుకున్న ఫలితంగా నీకిలా జరిగింది. ఇక ఇలాంటి తప్పు చేయనని చెంపలు వేసుకుంటే ఆటో కదులుతుందని” చెప్పారు. ఆటోవాడు అలా చెంపలేసుకున్న మరుక్షణమే ఆటో కదిలింది!

శ్రీస్వామివారు తమకు సన్నిహితంగా సేవచేసేవారిని, శ్రద్ధావంతులైన భక్తులను సాధ్యమైనంత వరకూ కేవలం లౌకికులైన జనంతో కలవడం తగదన్నట్లు సూచనగా హెచ్చరించేవారు. ఉదాహరణకు:

ఒక భక్తుడు కొంతకాలం వారిని సన్నిహితంగా సేవించి తర్వాత అతి చనువు వలన వారిపట్ల శ్రద్ధతగ్గి అవకాశ మొచ్చినప్పుడల్లా పామరులతో కలసి తిరగడమారంభించాడు. అంతకుముందు అతడు నివేదిస్తేనేగాని భోజనం చేయని శ్రీస్వామివారు తర్వాత అతడు పెడితే స్వీకరించక, “ఆయన మనుషుల్లోకి పోయాడయ్యో! ఆయనొద్దు, నువ్వు పెట్టు” అని మరొక సేవకుని కోరనారంభించారు. మొదట్లో తెలియక సన్నిహిత సేవకుడైన గురవయ్య

ఎప్పుడైనా వారి సన్నిధి విడిచి దూరంగా వెడితే "నువ్వుకూడా మనుషుల్లోకి పోతుండ్లాయ్యా?" అని మందలించేవారు.

77 **అంటే "మనుషుల" సాంగత్యం ముముక్షువునకు తగదని వారి
హెచ్చరిక. అరిషడ్వర్గయుక్తుడు, విషయ వాంఛాయుక్తుడు గనుక "మనిషి"
పరమలౌకికుడు అని శ్రీస్వామివారి భావం.**

**కనుక మనమిపుడు దీక్షా సమయంలో కానీ, ఇతర సమయములలో
గానీ శ్రీస్వామివారిని ఎలా సేవిస్తే వారు సంప్రీతులౌతారో గుర్తుంచు
కొనవలసియున్నది. ఇతరులను గూర్చి దుర్విమర్శలు చేయుట, ఊసుబోని
రాజకీయములు చర్చించుట, ఎప్పుడో, ఎక్కడో జరిగిపోయిన విషయములను
78 గూర్చి మననము చేయుట మొదలగువన్నీ శ్రీస్వామివారి దృష్టిలో మన
కంటుకునే మలినాలే. అది అంటుకున్నాక ఎన్నిమార్లు స్నానం చేసినా
ఆ మైల మనలనొదలదని శ్రీస్వామివారు తన ఆచరణ ద్వారా చూపించి
బోధించారు.**

మోపూరు దశయ్య (పెనుబర్తి) : "స్వామీ, మీరు కొండలలో అడవులలో తిరుగుతుంటారు. మిమ్ములను చూడాలంటే వీలుపడడంలేదు. ఎట్లా స్వామీ?" అన్నాడు. "అబ్బే అదేముందయ్యా? కొండమీద ఎక్కి బోటురాయి మీద అద్దంపెట్టి, నేరుగా చూస్తే మీకు మాకు దూరం బెత్తెడే గదయ్యా?" అన్నారు.

కొండంటే శరీరంలో పై భాగమైన మెదడు. బోటురాయి మీద అద్దంలో
చూడడమంటే లౌకిక వ్యవహారాలలో కొట్టుమిట్టాడే మనస్సును వాటి కతీతంగా
కొంచెంసేపు అద్దంవలె శుభ్రంగా, నిశ్చలంగా నిలిపితే శ్రీస్వామివారు
ఎక్కడున్నా మన మనోనేత్రంతో చూడగలమని శ్రీస్వామివారి భావం. మన
శరీరంలో బోటురాయివంటిది మాడు. దానిపైన సహస్రారమనే యోగ
కేంద్రముంటుందని, **దానిలోనే శ్రీ గురుచరణాలుంటాయనీ శాస్త్రం.
79 అందుకే శ్రీస్వామివారు, "మీకూ మాకూ బెత్తెడే గదయ్యా?" అన్నారు.
అంటే శ్రీస్వామివారు తాము సద్గురువునని మనకు తెలిపినట్లే!**

80 **"మీరు మమ్ములను చూస్తే మేము మిమ్ములను చూస్తాంళ్ళాయ్యా!"**
అన్నారు మరొకప్పుడు. సద్గురువులపై భక్తులెంత శ్రద్ధాభక్తులతో తమ దృష్టిని
నిలుపుతారో అంతమేరకు సద్గురువుల కృపాదృష్టి వారికి లభిస్తుంది. అందుకు

శ్రీ సాయిబాబా "నీ దృష్టి నాపై నిలుపు, నా దృష్టి నీపై నిలుపుతాను" అన్నారు.

మరొకప్పుడు శ్రీస్వామివారు తమ బృందంలో వారినుద్దేశించి అన్నారు, "మీరు మాలోళ్ళు నేను మాదిగవాణ్ణి".

శ్రీ అక్కల్ కోటస్వామి ఒకవంక తాను కాశ్యపస గోత్రానికి చెందిన యజుర్వేద బ్రాహ్మణుడనని ఒకరితోనూ, తాము మాలవారమని, తమ వృత్తి తోళ్ళపని అని మరొకరితోనూ చెప్పినట్లు వారి చరిత్రలో చూడవచ్చు. ఈనాడు గుడ్డిగా ప్రజలు అంటి పెట్టుకొనే వర్ణ వ్యవస్థ ఎంత అర్థరహితమో తెల్పడమే మహనీయుల లక్ష్యం.

గురువాజ్ఞను పాటించక సాధన చక్కగా చేయక కలహించుకొనే సేవకులనుద్దేశించి శ్రీస్వామివారు ఒకప్పుడన్నారు. "నిర్భాగ్యులు, ముండలు, రండలై ఉన్నారు. అంతా అప్పు, బాకీ చేస్తున్నారు. అర్దణా సంపాదిస్తున్నారా?" అన్నారు. **సకల సృష్టికీ, ప్రతి జీవికీ, ఆధారమూ, ఆత్మస్వరూపమూ అయిన** 81
**సద్గురువును మరచి అన్య భావాలకు తావివ్వడాన్ని రూపకాలంకారంగా పాతివ్రత్యభంగమన్నట్లు శ్రీస్వామివారు సూచించారు.**

ఒకరోజు దొంగతనం విషయమై ప్రస్తావన వస్తే శ్రీస్వామివారు "పావలాకు పదిరూపాయలు పోతుండ్లాయ్యా" అన్నారు అంటే ఒకటికి నలభైరెట్లు నష్టపోతారన్నమాట. **మరి దైవానికి భక్తితో సమర్పించిన** 82
**పావలాకు మరి ఎన్నిరెట్లు మేలు పొందుతారో మనం ఊహించవచ్చు.** శ్రీస్వామివారికి సమర్పించిన ప్రతి చిన్న సేవకు అనంతమైన పుణ్యఫలాన్ని మనకు ప్రసాదిస్తారని ఈ క్రింది సంఘటన తెలుపుతుంది.

ఒక రైతు క్రొత్తగా కొన్న గిత్తను కాడి కట్టి మరుపుతున్నాడు. కానీ అది బెదిరి చాలా బాధపెడుతూవుంది. శ్రీస్వామివారు ఆ మార్గమున పోతూ "అయ్యా బండి కట్టి నన్నా యేరు కాస్త దాటించు" అని అడిగారు. ఆ రైతు "స్వామీ ఇది ఇంకా కాడి మరగలేదు. బెదురుతుంది నాకు ఇది తప్పితే ఇక ఎద్దు లేదు" అని విన్నవించాడు. "అది బాగా లాగుతుందయ్యా! నీకెందుకు? బండి కట్టు చూస్తాం" అని అన్నారు. శ్రీస్వామివారి మీద భారం వేసి బండి కడితే మోకాటిలోతు బురదలో ఏమీ వెనుకాడకుండా సునాయాసంగా లాగడమే కాకుండా అది మొదలు బాగా అలవాటు పడిన ఎద్దులాగా సేద్యపు పనులన్నీ

చేయసాగింది. **శ్రీస్వామివారి కార్యానికి శ్రమపడినందున రైతుకు శ్రమ,**
83 **ఎద్దుకు దెబ్బలు తప్పిపోయాయి. ఆ చిన్న సేవకు ఆ రైతును ఆజన్మాంతము కాపాడుతారు శ్రీస్వామివారు.**

మంత్రోపదేశం కోరిన ఒక భక్తునితో శ్రీస్వామివారు, "మంత్రమెక్కడుంది, తంత్రమెక్కడుందయ్యా? చూచుకుంటూ పోయేదేగదా?" అన్నారు. జ్ఞానపూర్ణులైన సద్గురువులెవ్వరూ మంత్రోపదేశాలు చేయలేదు.
84 సాయిబాబా, రమణమహర్షి ఉదాహరణలు. కారణం **నిరంతరమైన సద్గురు భక్తి సకల సాధనలకూ అతీతమైనది, తిరుగులేనిది.**

శ్రీస్వామివారు ఒకరోజు గురవయ్యతో చెప్పారు "అంతటా సమానంగా చూచుకుంటే దేవుడవుతావు" ఒకరోజు రోశిరెడ్డితో చెప్పారు. **"వసద్ది చేసుకుంటే రెండక్షరాలు చాలయ్యా" అని. వసద్ది చేసుకోవడమంటే**
85 **సాధనద్వారా మనలోని రాగద్వేషములు, రాజస, తామస గుణములు నిర్మూలించుకొని దైవీసంపదలో నెలకొంటే ఏ మంత్రంతోనైనా తరించవచ్చని శ్రీస్వామివారి భావము.**

**శ్రీస్వామివారు సమాధి చెందేందుకు 6 నెలల ముందు నుంచి**
86 **"సత్యం, ధర్మం, సంపన్నత్వం, సాధారణత్వం, సద్గురు సేవ" అని చాలా రోజులు కేకలేస్తూనే వున్నారు. కనుక ఇది వారి సాంప్రదాయమని, వారి చరమోపదేశమనీ మనం గుర్తించాలి.**

87 **"అయ్యా ఈ కనబడేదంతా నిజమనుకుంటున్నారా?" అన్నారు ఒకప్పుడు. నామరూపాల భేదభావం వదలి అన్నింటిలోనున్న భగవత్‌తత్వాన్ని గుర్తిస్తూండమని శ్రీస్వామివారు హెచ్చరిస్తున్నారు.**

ఒకనాడు నెల్లూరు నుండి ఒక రెడ్డిగారు జబ్బుతో బాధపడుతూ వచ్చాడు. అతడి పైసలు వదిలాయేగానీ డాక్టర్ల వల్ల నయంకాలేదు. శ్రీస్వామివారు పలక లేదు. అతడు సేవకులతో "నా జబ్బు నయం చేస్తే
88 చాలా డబ్బు ఇస్తాను" అన్నాడు. శ్రీస్వామివారు **"ఏమిటయ్యా ఆయననేది? అందరికీ మనమిస్తుంటే ఆయనేంది మనకిచ్చేది?" అన్నారు. నిజానికి అందరికీ అన్నీ ఇచ్చేది ఆ భగవంతుడే గదా!**

ఒకసారి శ్రీస్వామివారు ఇలా అన్నారు. "ఆరు నాగళ్ళు గొఱ్ఱు కట్టి

నేనూ, జయరామరాజు దున్నుతున్నాము. జయరామరాజు గొఱ్ఱు ఉదయగిరి కొండకు తగిలి ఆగిపోయింది. నా గొఱ్ఱు మాత్రం ఆగకుండా సాగింది. ఉత్తర సముద్రం నీళ్ళు దక్షిణ సముద్రానికి పారాయి." ఆరు నాగళ్ళ సేద్యం అంటే అరిషడ్వర్గాల నరికట్టే సాధన. సముద్రాలు ఏకం కావడమంటే అంతా పరబ్రహ్మమని అనుభవమవటం కాబోలు. **జయరామరాజు తన సాధన నిలిపి** 89
**లౌకిక జీవితంలో చిక్కుకోవడమే ఆయన గొఱ్ఱు నిలిచిపోవడం కాబోలు.**

**శ్రీస్వామివారు శ్రద్ధా భక్తులు గలవారు, లేనివారు అనే భేదం** 90
**చూపేవారేగాని, ధనికులు-పేదవారనే భేదం యేనాడూ చూపేవారు కాదు. భక్తిగల చోటుకు తమను ఆహ్వానించకున్నా, నిరుపేదలైనా వారి వద్దకు వెళ్ళేవారు. ధనమదాంధులై భక్తి లేకుండా బంగారం పెడతామన్నా శ్రీస్వామివారు వెళ్ళేది లేదు.**

శ్రీస్వామివారికి నిరంతరం సేవచేస్తుండిన శిష్యులు తాము గమనించిన విశేషాలను ఇలా తెలిపారు.

**శ్రీస్వామివారు తమకు పరిచర్య చేసే వారిలో ఏ చెడు** 91
**అభిప్రాయమున్నా, అన్యచింతలు, పరదూషణ, కోపము వున్నా వారి సేవను అంగీకరించేవారు కాదు. ప్రతిరోజు పొగాకు వారిచేత పెట్టించుకునే శ్రీస్వామివారు అలాంటి సమయాలలో మరొకరి నడిగేవారు.**

ప్రతిరోజు శ్రీస్వామివారికి జావపోసే భక్తుడు కోనేటికి స్నానానికి వెళ్లి, సాటి భక్తులు కొందరిపై దుర్విమర్శలు చేయగా విని వచ్చాడు. శ్రీస్వామివారికి జావపోయబోతే, **"చెప్పుడు మాటలు వినివచ్చావు. నీవు** 92
**పోసే జావవద్దు" అని నిరాకరించారు. శ్రీస్వామివారి సమాధి దర్శనార్థం వచ్చి వారిని సేవించే భక్తులు ఎలా సేవించాలో ఇచ్చట గమనించ ప్రార్థన.**

1975వ సంవత్సరం వరకూ ఎన్నడూ భక్తులు సమర్పించిన క్రొత్త బట్టలు శ్రీస్వామివారు స్వీకరించలేదు. పాత గుడ్డలు, చినిగిపోయిన పాత దుప్పట్లు మాత్రం స్వీకరించేవారు. తమ సేవకులు తీసుకున్నా వప్పుకొనేవారు కాదు.

ఒకప్పుడొక శ్రీమంతుడు ఖరీదైన దుప్పటిని బలవంతంగా శ్రీస్వామివారి చెంత ఉంచి వెళ్ళాడు. స్వామి సేవకులు దానిని తీసుకున్నారు. సిద్ధలయ్యకొండ దగ్గర ఏమీ ఎరుగనట్లు "అయ్యా! ఒక క్రొత్త దుప్పటి కావాలి"

అని అడిగారు శ్రీస్వామివారు. **సేవకులా క్రొత్త దుప్పటి తెచ్చి ఇస్తే దాన్ని**
93 **జానెడు జానెడు పేలికలు చేసినదాకా ఆయన ఒప్పుకోలేదు. "అయ్యా!**
**ఈ పేలికలు జబ్బులవాళ్ళకివ్వండి జబ్బులు పోతాయి" అన్నారు.**

గోతపు సంచులు, తాటాకు దొన్నెలు, తాటాకు చదరలు, మట్టి పాత్రలు అల్యూమినియం దబరలు మాత్రం వాడేవారు. విలువగల వస్తువులు తమవద్ద ఉండనిచ్చేవారు కాదు. ఒకొప్పుడొక శ్రీమంతుడు ఖరీదైన జిప్‌బ్యాగ్‌ను వద్దన్నా వినకుండా శ్రీస్వామివారి చెంత ఉంచి వెళ్ళాడు. **దానిలో సేవకులు తమ**
94 **గుడ్డలు పెట్టుకున్నారు. అర్థరాత్రి అందరూ నిద్రలో ఉండగా శ్రీస్వామివారు**
**పరిగాడుతూ పోయి ఆ బ్యాగ్‌ను ధునిలో కాల్చేశారు. (వైరాగ్యం)**

ఒకసారి జోరున వర్షం కురుస్తున్నది. శ్రీస్వామివారు చెట్టు క్రింద కూర్చుని అగ్నిని సంరక్షిస్తున్నారు. వాన నీరు చెట్ల ఆకులలో నుంచి పడడం వలన ఒక ప్రక్క నుంచి మంట చల్లారుతూంది. కానీ శ్రీస్వామివారు ఓర్పుగా మరొక పక్క నుంచి చితుకులు వేసి మంటను రగులుస్తున్నారు. ఆయన పడుతున్న అవస్థను చూచి భక్తులు, "స్వామి! ఎందుకీ శ్రమ? మీరు దేవాలయం పంచలో అగ్ని వేసుకుంటే సరిపోతుంది గదా!" అన్నారు. శ్రీస్వామివారు, "అయ్యా! బొక్క పడుతుందిగా?" అని క్లుప్తంగా సమాధానమిచ్చారు. భక్తులకామాటలు అర్థం కాలేదు. ఆయన ఆ శ్రమకు వెరచి తమ నియమాన్ని ఉల్లంఘిస్తే స్వధర్మమనే దేవాలయం కప్పు బొక్క (రంధ్రం) పడినట్లేనని, నిరంతరం అగ్నివలే ప్రజ్వరిల్లే తమ ధర్మనిష్ట వానకు నిప్పు వలే చల్లారినట్లేనని వారి భావం. లేక ఆ సమయంలో వర్షపు చినుకుల వలన తమ అగ్ని సేవనానికి విషమ పరీక్ష ఏర్పడడమే దైవనిర్ణయమైతే, తాము ఆ రోజు ఆలయం వరండాలోకి తమ మకాము మార్చినా, దాని కప్పుకు చిల్లిబడియైనా అలానే ఇబ్బంది కలిగి తీరుతుందని వారి భావమై ఉండవచ్చు. **కార్యదీక్ష అంటే**
95 **ఎలా ఉండాలో, దైవనిర్ణయముపై మన విశ్వాసమెలా ఉండాలో**
**శ్రీస్వామివారు మనకు ఈ సన్నివేశం ద్వారా బోధిస్తున్నారు.**

ఒకసారి శ్రీస్వామివారి సేవకులు త్రోవన వస్తున్నారు. "అందరూ దొంగ సాధువులే - పొట్టకూటి స్వాములు" అని ఎవరో తుంటరులు తూలనాడారు. తుంటరులలో ప్రముఖుడైన రైతుపై కోపగించి ఒక భక్తుడు కలబడబోయాడు. శ్రీస్వామివారు తమ సేవకుని ఆపి, **"ఏందయ్యో!**

**వాళ్ళంటుంటే ఓర్చుకుంటేగదయ్యా నిజంగా మనం సాధువులం!”** అని 96
చెప్పి, “నీకు ఓర్పులేదు. కనుక నిజంగా దొంగసాధువువే” అని మెత్తగా ఆ భక్తునికి పాఠం చెప్పారు. అది మనందరికి గుణపాఠమే.

ఒకరోజు దక్షాది రమణయ్య, పోలు మస్తానయ్య శ్రీస్వామివారి సన్నిధిలో ఉన్నారు. రమణయ్య, మస్తానయ్యను “ఒరేయ్ మస్తానయ్య, ఇట్లారా!” అని పిలిచాడు. అతడు పలకలేదు. రమణయ్య మరలా మరలా ఆయన్నలాగే పిలిచాడు. తనను “ఒరేయ్” అని ఏకవచన ప్రయోగం చేసి పిలిచినందుకు మస్తానయ్య బాధపడి “నన్ను ‘ఒరేయ్’ అంటావా? నీవు ఆశ్రమం బయటకురా నీ సంగతి చెపుతాను” అని మనస్సులో అనుకున్నాడు. వెంటనే శ్రీస్వామివారు, “అయ్యా, ఒరేయ్ అన్నదెవరు?”

మస్తానయ్య : రమణయ్య స్వామీ!

స్వామి : అతడికి పాపం మూడు వందలు లెక్క వ్రాశారయ్యా!

రమణయ్య : స్వామీ! ఆ లెక్క ఎట్లా పోతుంది?

స్వామి : అనుభవిస్తే పోతుంది.

“నన్ను అమర్యాదగా మాట్లాడినందుకు అనుభవిస్తాడులే” అని మస్తానయ్య శాంతించాడు.

మనం స్వల్పమైనవని భావించే పొరపాట్లు నిజానికి చిన్నవేకాదు. గడ్డిపోచలు ఎంత బలహీనంగా కనిపించినా, అవన్నీ త్రాడుగా పేనబడినపుడు మదపుటేనుగును గూడా బంధిస్తుంది. అలానే కర్మబంధాన్ని కల్గిస్తుంది. “సాటివారిని నిందించడం పంది మలభక్షణ చేయడం లాంటిద”ని సాయి కూడా అన్నారు. **“బుద్ధిలేనివాడా!” అని సాటివారిని అనినా గూడా నరకానికి పోవలసి వస్తుందని క్రీస్తు కూడా చెప్పారు. మనమెంత జాగ్రత్తగా ఉండాలో! దీనినే వాక్కును నియమించుట, లేక సరళమైన** 97
**వాక్కును గల్గియుండుట అని ఋషులు అన్నారు. శ్రీసాయి సమకాలికుడు అయిన మహనీయుడు శ్రీతాజుద్దీన్ బాబా ఇలా అన్నారు. “కాబాను తగులబెట్టితే తగలబెట్టావు, ఖురాను తగుల బెట్టినా పెట్టేవు, మద్యం త్రాగితే త్రాగావు, విగ్రహారాధన జరిగే మందిరంలో నివసించినా ఫరవాలేదేమోగాని, మనిషి హృదయాన్ని మాత్రమెన్నడూ గాయపరచకు. కారణం భగవంతుని**

**నిలయమైన ఏడవ స్వర్గం మానవ హృదయంలో దాగియుంటుంది."**

ఒకసారి శ్రీస్వామివారికి విరేచనాలై పదిహేను రోజులు బలహీనంగా ఉన్నారు. **"మందు తీసుకోండి స్వామీ" అంటే "దేవుడిచ్చింది**
98 **అనుభవించొద్దయ్యా?" అన్నారు.**

కావుకావుమని అరుస్తున్న కాకిని రాయితో కొట్టబోతే శ్రీస్వామివారు గురవయ్యను వారించారు. శ్రీస్వామివారు చూస్తుండగా కుక్కనుకూడ కొట్టేందుకు వీలులేదు అంటాడు గురవయ్య.

**ధర్మశాస్త్రంలో చెప్పబడిన ధర్మసూక్ష్మాన్ని సర్వధర్మజ్ఞులు, బ్రహ్మవేత్తలూ అయిన మహనీయుల నుండి తెలుసుకోవాలని ధర్మశాస్త్రాలే చెపుతాయి. అలా చేయకపోవడం వలన మన సమాజంలో వర్ణవ్యవస్థ తారుమారై ప్రజా శ్రేయస్సుకుపకరించే బదులు దేశానికి దౌర్భాగ్యంగా పరిణమించింది. నేటి సమాజంలో వర్ణభేదం జన్మను బట్టి వస్తుందని**
98A **తలచబడుతూంది. కానీ నిజానికది గుణాన్ని బట్టి ఏర్పడిందని భగవద్గీతలో (4 : 13) చెప్పబడింది. అయినప్పటికీ కొందరు పండితులు దానిని వక్రించి వ్యాఖ్యానించారని బ్రహ్మవేత్తల బోధలవలన తెలుస్తుంది.**

ఉదాహరణకు శిరిడీ సాయిబాబా, "మనలో ప్రతివారిలోను ఒక అంత్యజుడుంటాడు. వాణ్ణి వెళ్ళగొట్టాలి" అన్నారు. ఇక్కడ అంత్యజుడంటే అరిషడ్వర్గాలకు ప్రేరకమైన అజ్ఞానమూ, దాని ప్రత్యక్ష రూపమైన అహంకారమూ అని మనము గుర్తించాలి. ఈ విషయాన్నే ఆయన మరొకసారి, "వసతి గృహంలోని దొంగలను కనిపెట్టాలి" అని చెప్పారు. జన్మజన్మకూ మారుతుండే అశాశ్వతమైన శరీరమే వసతి గృహము లేక సత్రము. అది ఎవరికీ స్థిరనివాసం కాజాలదు.

అలానే వారి సమకాలికులు, మరొక రూపమూ అయిన శ్రీ అక్కల్ కోటస్వామి ఆ భావాన్నే సూచించారు. ఆయన దర్శనార్థం వచ్చిన ఒక సద్బ్రాహ్మణుడు విధిలేక ఒక హరిజనుడి ఇంటి వద్ద కుండలోని నీటితో స్నానసంధ్యలు పూర్తిచేసుకొని, స్వామిని దర్శించి, బ్రాహ్మణ పంక్తిలో భోజనానికి కూర్చున్నాడు. అది గమనించిన శ్రీస్వామివారి సేవకుడొకడు అతడిలా చేసినందుకు తీవ్రంగా విమర్శించి, పంక్తిలో నుంచి వెళ్ళగొట్టాడు. ఆ సద్బ్రాహ్మణుడు నొచ్చుకున్నాడు. తరువాత ఆ సేవకుడు శ్రీస్వామివారికి

యధావిధిగా భిక్ష ఇచ్చినప్పుడు ఆయన స్వీకరించలేదు. తన నేరమేమని అడిగిన సేవకుని చేత ఆ హరిజనుని పిలిపించి, అతడి నొసట విభూతిపెట్టి, నేలమీద ఏడుగీతలు గీచి, ఒక్కొక్క గీత దాటుతూ పూర్వ జన్మల స్మృతిని పొంది వేరు వేరు జన్మలలో వివిధ వర్ణాలలో జన్మించాననీ, ఏడుజన్మల క్రిందట తానొక కర్మటుడైన బ్రాహ్మణుడనని చెప్పాడు. శ్రీస్వామివారు పరీక్షించగా అతడు వేద వేదాంగాలలోని విషయాలను వల్లించి తన పూర్వజన్మ జ్ఞానం యదార్థమని నిరూపించుకున్నాడు. 'అయితే ఈ జన్మలో ఈ వర్ణంలో జన్మించావేమి?' అని శ్రీస్వామివారడిగితే, **తాను బ్రాహ్మణుడుగా ఉన్నప్పుడు ఇతర వర్ణస్థులను అసహ్యించుకుంటూ, వారందరూ నడచిన బాటమీద మంత్రజలం చల్లుకొని శుద్ధి చేసుకొని తాను నడిచే వాడిననీ, అట్టి అనన్య చింతన వలన తనకిప్పుడు ఈ జన్మ ప్రాప్తించిందనీ, ఆ హరిజనుడు చెప్పాడు. వర్ణభేదం జన్మవలన వస్తుందని తలచి సంకుచితమైన** 99
**అసహనాన్ని వహించిన వారికి, జన్మాంతరంలో ఆధ్యాత్మిక జ్ఞానానికే అవకాశంలేని కుటుంబాలలో జన్మించవలసి ఉంటుందని శ్రీస్వామివారు తమ సేవకునికి తెలియబరచారు. శాస్త్రాల అర్థాన్ని మహనీయుల యొద్ద తెలిసికొనక మనకు తోచిన తప్పుడు అర్థాలను అనుసరించి నడుచుకుంటే కలిగే అనర్థమే ఇది.**

వారి ఈ భావం ఇంకా స్పష్టమయ్యేలాగా ఆయన తరచు భక్తులతో 'మాలవాళ్ళు, మాదిగవాళ్ళు నీలో లేకుండా చూచుకో అయ్యా' అనేవారు. ఒక్కొక్కప్పుడు అన్యవర్ణస్థులు తమ దర్శనానికి వచ్చినపుడు వారిని శ్రీస్వామివారు బ్రాహ్మణులనేవారు. ఉదా: జన్మతః వైశ్యులైన నన్ను (రచయిత) బ్రాహ్మణుడనేవారు. అలానే అల్లుభాస్కర్ అనే రెడ్డి వర్ణస్తుడు వారి దర్శనానికి వస్తుంటే 'అడుగో ఒక బ్రాహ్మణుడొస్తున్నాడు' అన్నారు శ్రీస్వామివారు. అంటే ఆయన దృష్టిలో మహాత్ములయందు పూజ్యభావము, మోక్షము లేక బ్రహ్మజ్ఞానం కోసం కోరిక గలవారే బ్రాహ్మణులన్నమాట. సరిగా వజ్రసూచి ఉపనిషత్తులో బ్రాహ్మణత్వం ఇలానే నిర్వచించబడడం గమనార్హం. అంతేగాక జన్మతః బ్రాహ్మణుడైనవాడు గూడా నిజమైన బ్రాహ్మణత్వానికి తగని రీతిన జీవించినట్లయితే అతడికి శూద్రత్వము, చండాలత్వము ప్రాప్తించి అతడు ధర్మబాహ్యుడౌతాడని ధర్మశాస్త్ర గ్రంథాలలో చెప్పబడ్డది. అంటే ముముక్షువు

కుండవలసిన గుణాలుగల్గి, వాటికి తగిన రీతిన జీవించేవాడే బ్రాహ్మణుడనే అర్థం గాదా? అటువంటి వాడికి మాత్రమే బ్రాహ్మణ సంస్కారాలన్నీ సార్థకమౌతాయని గదా శాస్త్రం?

అటువంటి గుణాలను దైవీసంపద, సత్త్వగుణము అని భగవద్గీత అభివర్ణించిందని మనం గుర్తించాలి. అట్టివారు చేసిన యజ్ఞ, దాన, తపః, కర్మలు మాత్రమే మోక్షమనే సాఫల్యాన్ని పొందుతాయని గూడా భగవద్గీతలోని శ్రద్ధాత్రయ విభాగయోగము స్పష్టంగా చెపుతుంది. దీనినే శ్రీ వెంకయ్య స్వామివారు, "సంపన్నత్వం, సాధారణత్వం గల్గి, సద్గురు సేవ చేయమనేవారు. సంపన్నత్వము అనగా పైన చెప్పిన దైవీసంపద గల్గియుండడమన్నమాట.

సాధారణత్వమంటే అట్టి గుణాలు తనలో ఉన్నాయని, తానొక సాధువు లేక ముముక్షువునని, తాను పవిత్రుడనని విర్రవీగి, సాటివారిని హీనులుగా తలచకుండడం అన్నమాట. ఈ సూత్రానికి స్వామి యొక్క జీవిత విధానమే చక్కటి ఆదర్శం. అందుకే అటువంటి మహనీయుల ఆచరణనే, బోధనే ప్రమాణంగా స్వీకరించాలని ధర్మ శాస్త్రాలు ఘోషించాయి.

బౌద్ధ, జైన, పార్శీ, క్రైస్తవ, ఇస్లాం మతాలు ఇందుకే "పవిత్రమైన ఆధ్యాత్మిక జీవనం కలవారు, దానిని కలిగియుండనివారు" అని సమాజంలోని వ్యక్తులను వర్గీకరించడం గమనార్హం.

**"కష్టమంటే ఏమిటో, సుఖమంటే ఏమిటో నాకు తెలియదయ్యా"**
100 **అన్నారు రోశిరెడ్డితో శ్రీస్వామివారు (అంటే ఇష్టాఇష్టాలు పోగొట్టుకో, సుఖేచ్ఛ వదులు అని).**

'సాధన చేసుకుంటూ దైవకృప ఎలా కలుగుతుంద'ని అడిగిన భక్తునితో **"అయ్యా! పై మిద్దేసుకుంటే బాగుంటుండ్లా" అన్నారు. అమర నారాయణ**
101 **శతకంలో ఆధ్యాత్మికంగా దైవీసంపదను సాధించడాన్ని పైమిద్దె నిర్మించడంగా పోల్చి చెప్పారు.**

మరొక భక్తుడు "స్వామీ! నన్ను సాధన చేసుకుంటూ ఎచ్చట ఉండమంటారు?" అన్నాడు. 'ఎక్కడైనా ఒక్క దూలపు ఇల్లు వేసుకొని ఉండవచ్చు'. 'ఏ ఊరిలో ఉండమంటారు? ఏ ఆశ్రమంలో ఉండమంటారు?'

అని మరలా మరలా ఎన్నిమార్లు అడిగినా గానీ శ్రీస్వామివారు మాత్రం "ఒక్క దూలపు ఇల్లు వేసుకొని ఎక్కడైనా ఉండవచ్చు" అని శెలవిచ్చారు. ఇల్లంటే శరీరం. దీనికి ఒక్క దూలం ఆధారం అంటే ఒక్క దైవమే శరణ్యంగా సర్వస్యశరణాగతితో జీవించడం. మానవులు ధనకనక వస్తువాహనాలే జీవిత ఆధారమని నమ్ముతారు. నిజానికి అవి అశాశ్వతములు. దైవమే ఆధారంగా జీవిస్తూ అదే గమ్యంగా భావిస్తూంటే ఎక్కడున్నా సాధనే – 'సబ్‌కా మాలిక్ ఏక్ హై' అన్న సాయి వాక్యాన్ని శ్రీస్వామివారు ఇలా చెప్పారన్నమాట. సర్వశాస్త్రముల సారమును శ్రీస్వామివారి వలె మామూలు భాషలో చెప్పగల పండితులెచ్చట లభిస్తారు!

తమ ఆధ్యాత్మిక ధనాన్ని గూర్చి శ్రీస్వామివారు అన్నారు "కొండలు కొండలుగా డబ్బులువున్నా, ఒక్కరు కూడా అడుగరేమయ్యా? కొండలు పొర్లి జారి వచ్చేస్తున్నాయయ్యా!"

మరొకసారి శ్రీస్వామివారు అన్నారు – "ఏడుకొండలు యాలానికి వచ్చాయి, పాటపాడి కొనేవాళ్ళుంటే కొనవచ్చయ్యా". మరొకసారి "నల్లకొండలు యాలానికి వచ్చాయి. కొనేవాడే లేడే" అని వాపోయారు. సాయినాథుడు "జ్ఞానధనం రాసులుగా ఉన్నా అడిగే నాథుడేలేడే అని" అన్నట్లు ఉంది.

"దక్షిణపు కొండ తేలివచ్చింది. ఎవరైనా కొనేవాళ్ళు ఉంటే కొనమని అందరికి చెప్పయ్యా" అన్నారు శ్రీస్వామివారు.

ఒకప్పుడు శ్రీస్వామివారు "బ్రాహ్మణులలో మాదిగవాళ్ళు ఉన్నారు, మాదిగవాళ్ళలో బ్రాహ్మణవాళ్ళు ఉన్నారు. కోమటి వాళ్ళలో కమ్మవాళ్ళు, కమ్మవాళ్ళలో కోమటివాళ్ళు ఉన్నారు. గొల్లవాళ్ళలో మాలవాళ్ళు, మాలవాళ్ళలో గొల్లవారు ఉన్నారు. లోకమంతా ఈ విధంగా ఉందయ్యా అని అన్నారు".

**"లాభంలో భాగం తీసుకుంటే పాపంలో కూడా భాగమొస్తుందయ్యా" అన్నారు మరొక రోజు. (మనం చందాలు ఎవరిని అడగాలో యోచించండి)** 102

భక్తుడు : స్వామీ మానవుడు చనిపోయాక తిరిగి జన్మ ఉన్నదా? ఉంటే మనిషిగానే జన్మిస్తాడా? లేక పశుపక్ష్యాదులుగా జన్మిస్తాడా?

స్వామి : మనిషై పోతే మనిషిగానే వస్తుళ్ళాయ్యా.(దుర్లభమైన

మానవజన్మ వచ్చింది. సద్వినియోగం చేసుకో, సద్గురుని అన్వేషణ, సేవ సాధించు)

**అంటే మానవ లక్షణములు గల్గి జీవిస్తే మానవుడుగానే జన్మిస్తాడని, అలాగాక ఇంద్రియలోలత గల పశులక్షణములు గల్గి జీవితాన్ని గడిపితే**
**103 హీన జన్మలొస్తాయనీ గనుక మానవ జన్మ సార్థకమయ్యేలాగా జీవితాన్ని గడపమని శ్రీస్వామివారు సెలవిచ్చారు.**

పునర్జన్మ వున్నదని ఇప్పుడు చెప్పినట్లే – అనేక మంది భక్తులు పూర్వ జన్మలో ఎచ్చటెచ్చట జన్మించి ఏమేమి చేసేవారోకూడా శ్రీస్వామివారు చెప్పేవారు.

ఇదే ప్రశ్న మరొకభక్తుడడిగితే "దేంతో పీకులాడుతూపోతే దానిలోకే వస్తుండ్లాయ్యా" అన్నారు. అంటే జీవితాంతం దేనిపై ఎక్కువ ప్రీతితో మనసంతా నింపుకొని వుంటామో, చివరి క్షణాల్లో దాన్నే స్మరిస్తూ ప్రాణాలొదిలి అదే విధంగా జన్మిస్తాడని, అంత్యకాలంలో దేనిని స్మరిస్తూ శరీరం వదులుతాడో అలాగే జన్మిస్తాడని గీతలో చెప్పబడ్డదానికి ఇది శ్రీస్వామివారి వ్యాఖ్య అన్నమాట.

మరొకభక్తుడు ముక్తిమార్గం బోధించమంటే శ్రీస్వామివారు ఇలా చెప్పారు.

"అయ్యా! ఆయనను మూడు లక్షలు కట్టమను" అన్నారు.

అంత పైకం లేదు స్వామీ అంటే

"ఆరు లక్షలు కట్టమనయ్యా" అన్నారు.

"అసలు డబ్బేలేదు స్వామీ" అంటే

"8 లక్షలైనా కట్టమనయ్యా" అన్నారు

**మూడు లక్షలు ఈషణ త్రయమును వదలమని, ఆరు లక్షలు అరిషడ్వర్గాలకు, 8 లక్షలు అష్టమదములకు సంకేతంగా చెప్పారు**
**104 శ్రీస్వామివారు. శ్రీస్వామివారికి ఏ ఆధ్యాత్మిక శాస్త్రాలూ తెలియవని అనుకుందామా?**

ఒకప్పుడు పోలీసులు ఒక దొంగతనం అన్వేషణలో శ్రీస్వామివారిని

అనుమానించి కలువాయి పోలీసు స్టేషనుకు తీసుకువెళ్ళి రూములో పెట్టారు. సాయంకాలమునకు కలువాయి గ్రామ ప్రజలకు ఆ విషయం తెలిసి సబ్ ఇన్స్పెక్టరును నాలుగు చీవాట్లు పెట్టి "ఎవరనుకున్నావు ఆయనను, తీసుకొచ్చి స్టేషన్‌లో పెట్టావే నీకేమైనా బుద్ధివుందా" అని శ్రీస్వామివారి సంగతి చెప్పారు. ఆ ఇన్స్పెక్టరు 'స్వామీ తెలియక తప్పు జరిగింది క్షమించండి' అని శ్రీస్వామివారిని వెళ్ళమన్నారు. శ్రీస్వామివారు ఆ గ్రామస్తులతో "ఏమయ్యా ఇక్కడైనా బాగానే ఉందయ్యా" అన్నారు. ఇంకా ఇక్కడ ఆరుగంటలు ఉండాలి అని మరికొంతసేపు అక్కడ వుండి వచ్చారు. వారికి సుఖదుఃఖములు అనే ద్వంద్వములు ఉంటే గదా!

ఒక భక్తుడు శ్రీస్వామివారితో "స్వామీ, హస్త కార్తెలో జొన్న వేస్తాను" అని అన్నాడు. అందుకు శ్రీస్వామివారు "ఊర్లో జొన్నలన్నీ నీవే గదయ్యా" అన్నారు. అంటే అర్థమేమిటో ఆ భక్తుడు వివరంగా అడిగి తెలుసుకోకుండానే 'ఈ సంవత్సరం గ్రామస్తులందరికీ పంట పండదు. అందరి పంట నాకొక్కడికే పండుతుంది' అని శ్రీస్వామివారి మాటలకు అర్థం చెప్పుకొని హస్త కార్తెలో జొన్న పైరు పెట్టాడు. ఈ భక్తుడి పైరు మాత్రమే గింజ కూడా పండకుండా పోయింది. తక్కిన రైతులకు దివ్యంగా పండింది. ఈ భక్తుడు ఆ సంవత్సరం పొడుగునా అడిగిన వాళ్ళను అడగకుండా గ్రామస్తులందరి దగ్గరా జొన్నలు బదులు తెచ్చుకొని తిన్నాడు. ఆ విధంగా ఊర్లో జొన్నలన్నీ ఆయనవే అయినవి. ఊర్లో జొన్నలన్నీ తనకెలా వస్తాయని తలచాడో, అలా తనకు వచ్చినా వాటిని మరలా అందరికీ ఇవ్వవలసి ఉంటుంది అనే వివేకం లేకపోయింది. ఆశ ఎలాంటి భావాలను, అర్థాలను చెపుతుందో చూడండి. అలాంటి పేరాశను వదలమనే శ్రీస్వామివారు అలా అన్నారు.

నూతేటి శ్రీ రాములునాయుడు తన నిమ్మతోటలోని గుడిసెలో శ్రీస్వామివారి పటాన్ని పూజించేవాడు. ఒకరోజు నివేదనకేమీ లేక ఒక మంచి నిమ్మకాయని రెండు ముక్కలుగా కోసి నివేదించాడు. కానీ దాన్ని తాను ప్రసాదంగా స్వీకరించలేదు కదా! ఆ సాయంత్రం ఇంటి నుండి ఆయనకు పేలపిండి తెచ్చారు. రాత్రికి పేలపిండి నైవేద్యం శ్రీస్వామివారికి సమర్పించాడు. పూజానంతరం ఆ పేలపిండిని ప్రసాదంగా నోట్లో వేసుకున్నాడు. అది నిమ్మరసం వలె అమిత పుల్లగా ఉండటం చూచి ఆశ్చర్యపోయాడు. నివేదనకు

పెట్టకుండా తాను తినేందుకు ప్రక్కన ఉంచిన మిగతా పేలపిండి తియ్యగానే ఉంది. **మనం ప్రీతితో తినే పదార్థాన్నే దైవానికి నివేదించాలనీ, మనం తినేందుకు ఇష్టపడని పదార్థాన్ని దైవానికి నివేదించకూడదని**
105 **శ్రీస్వామివారు తనకు ఈ లీల ద్వారా బోధిస్తున్నారని ఆయన గ్రహించాడు. ఇది మనందరకూ కూడా మంచి ఉపదేశమే.**

గోవు పంచితాన్ని పవిత్రంగా ఇండ్లలో స్వల్పంగా చల్లుకొనడము కొంత మంది కళ్ళకు మంచిదని కళ్ళలో వేసుకోవడము కద్దు. ఒకరోజు శ్రీ రాములనాయుడు **గోవు పంచితాన్ని తన గుడిసెలో చల్లుతుండగా శ్రీస్వామివారి పటం పైన కూడా పడింది. అలా పడితే మంచిదిలే అని**
106 **తుడవకుండా వదిలేశాడు. ఆ రాత్రి ఆయన కూర్చునియుండగా ఆయన పైన ఏదో ద్రవం పడింది. బల్లి ఒంటేలు పోసిందని పైన చూస్తే బల్లిలేదు. గుడ్డ తడిసిన చోట వాసన చూస్తే అది పంచితం వాసన.** ఆయనకు అసహ్యమనిపించింది. ఇప్పుడు నాపై పంచితం ఎలా పడ్డాయా అని ఆలోచించాడు. "పంచితం నీపైన పడితే అసహ్యించుకొంటావే, మరి నాపై పడితే తుడవకుండా వదిలేశావే" అని శ్రీస్వామివారు ఆయనకు ఆత్మబోధ చేసారట. 'నా పటానికి నాకు భేదం లేద'ని శ్రీస్వామివారు మరొకసారి నిరూపించారు.

